ఖరీఫ్ సాగు పనుల్లో రైతుల నిమగ్నం

- ఈ ఏడాది పెరిగిన సాగు వ్యయం
- పెట్టుబడి కోసం దిక్కుతోచని స్థితిలో రైతులు


సాగు పనుల్లో రైతులు

పెదవేగి : వర్షాలు కురవడంతో ఖరీఫ్ సాగు పనులు ప్రారంభించేందుకు రైతులు సమాయత్తమయ్యారు. వ్యవసాయ పెట్టుబడులకు ఏటా పెరుగుతున్న ఖర్చులు రైతుల ఆందోళనను మరింత పెంచుతున్నాయి. జూన్ నెల వచ్చిందంటే సాగుదారులు పెట్టుబడి కోసం ఎదురుచూస్తారు.

అన్నదాతకు వెన్నుదన్నేదీ?

రైతుల పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. జూన్‌లో పొలం దుక్కిలతో ప్రారంభమైమయ్యే సాగు పనులు విత్తనాల కొనుగోలు, పొలం గట్లు బాగు చేయడం, విత్తనాలు చల్లుకోవడం, కలుపు నివారణ, ఎరువులు, పురుగు మందులు, సాగుకు నీటి తడులు, పంట కోత నూర్పుల వరకు ప్రతి దశలోనూ పెట్టుబడి లేకుండా ఏ పనీ జరగదు. ఎకరం పొలంలో పంట సాగుకు రైతు కుటుంబ సభ్యులు కష్టపడితే రూ.20 వేల వరకు పెట్టుబడి అవుతుంది. ఈ ఏడాది నుంచి రైతులపై పెట్టుబడి భారం పెరగనుంది. ఎరువులపై వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) పెరగనుంది. దెందులూరు నియోజకవర్గంలో 20 వేల ఎకరాల్లో రైతులు వరి పంటను మరో 490 ఎకరాల్లో కూరగాయలు, ఆకుకూరలతోపాటు వివిధ రకాల పంటలు పండిస్తున్నారు. ఈ పంటలన్నింటికీ వేలల్లో పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది.

ఎకరా విస్తీర్ణంలో వరి సాగుకు

ఒక ఎకరం వరి సాగుకు మొదటి దుక్కికి రూ.1,500, విత్తనాలకు రూ.900, విత్తనాలు వేసే దుక్కికి రూ.1,200, పొలం గట్లు బాగుకు రూ.500, ఎండ్ల బండితో పట్టి లాగేందుకు రూ.600, దమ్ముచేసేందుకు రూ.3,000, నారు తీత, ఊడ్చేందుకు రూ.5,000, ఎరువు లు రూ.4,000, పురుగుల మందులకు రూ.6,000, కోత కోసేందుకు రూ.4,500, పండిన ధాన్యం బయటకు తీసుకువచ్చి, కాటా వేసినందుకు రూ.3,000, వడ్లు ఆరబెట్టేందుకు రూ.1,500 ఖర్చవుతుందని రైతు లు చెబుతున్నారు. ఈ ఏడాది ఎకరానికి రూ.30 వేలనుంచి రూ.40 వేలు పెట్టుబడి పెరుగుతుంది.

రూ.30 వేలు పెట్టుబడి పెట్టాలి



వ్యవసాయ పనులు ప్రారంభమయ్యాయి. బ్యాంకుల నుంచి రుణా లు అందక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాం. ఒక్కో కౌలు రైతు ఎకరం నుంచి రెండెకరాలు సాగు చేస్తారు. ఎకరానికి రూ.30 వేలు పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. వడ్డీ వ్యాపారులు సైతం బ్యాంకుల్లో సరిపడ నగదు లేకపోవడం వల్ల అరువు ఇవ్వడం లేదు. ఏం చేయాలో అర్థం కావడం లేదు.

– పచ్చా విజయ శంకర్, రైతు,వంగూరు

నేడు సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

దెందులూరు: గోపన్నపాలెం సాయిబాబా ఆలయ వార్షికోత్సవం శనివారం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ గోపి తెలిపారు. ఉదయం సాయిబాబా ఆలయంలో పూజలు అనంతరం భక్తుల సహకారంతో ఆలయ ఆవరణలో అన్నదానం నిర్వహిస్తామని భక్తులందరూ పాల్గొనాలని ఆయన కోరారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

పెదవేగి : తన భార్య పిల్లలు రెండు రోజులుగా కనిపించడం లేదని ఓ భర్త పోలీసులను ఆశ్రయించాడు. పెదవేగి ఎస్సై రాజేంద్రప్రసాద్ తెలిసిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదవేగి మండలం విజయరాయికి చెందిన పూల నాగమనోహర్ భార్య, ఇద్దరు పిల్లలు ఈనెల 12న మధ్యాహ్నం నుంచి కనిపించడం లేదని, చుట్టు పక్కల, బంధువుల ఇంటి వద్ద వెతికినా ప్రయోజనం లేకపోవడంతో పెదవేగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

క్లుప్తంగా

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం


మలేరియా జ్వరాలపై అవగాహన ర్యాలీ

ఉంగుటూరు: పరిసరాల పరిశుభ్రతతో ప్రజలకు ఆరోగ్యం కలుగుతుందని చేబ్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర డాక్టరు డా.శ్రావణ రెడ్డి తెలిపారు. శుక్రవారం చేబ్రోలు పీహెచ్‌సీలో మలేరియాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా శ్రావణ రెడ్డి మాట్లాడుతూ చలి జ్వరంతో బాధపడుతున్న వారిని గుర్తించి మలేరియా నిర్ధారణ పరీక్షలు చేయించాలని సూచించారు. ఆరోగ్య కేంద్రం పరిధిలోని అన్ని గ్రామాల్లో ఈ కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు, పర్యవేక్షకులు అప్రమత్తంగా పనిచేయాలన్నారు. మలేరియా సబ్‌యూనిట్ అధికారి లక్ష్మణరావు మాట్లాడుతూ ఈ నెలంతా మలేరియాపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.సామాజిక ఆరోగ్య అధికారి రత్నరాజ్యం, పర్యవేక్షకులు వివి నాగలోఖ్మ,కె.గంగాధరరావు పాల్గొన్నారు.

సాల్వేషన్ ఆర్మీ చర్చి నిర్మాణానికి ప్రార్థనలు

దెందులూరు: దెందులూరులో చారిత్రాత్మక ఆధ్యాత్మిక విశిష్టత గల సాల్వేషన్ ఆర్మీ చర్చి నిర్మాణ పనులకు ఎటువంటి ఆటంకాలు లేకుండా నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి కావాలని ఆర్‌సీఎం చర్చి దెందులూరు ఫాదర్ జీ.అమ్మన్‌రాజా అన్నారు. శుక్రవారం దెందులూరు సాల్వేషన్ ఆర్మీ చర్చి నిర్మాణ పనుల ప్రారంభం సందర్భంగా ఆయన స్థానిక కోర్ ఆఫీసర్ మేజర్ కాకి రమణయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేసి నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ కల్నల్ జోషియా, సాల్వేషన్ ఆర్మీ యూత్, గృహ సమితి సభ్యులు, సంఘ పెద్దలు, గ్రామస్తులు ఉన్నారు.

ఎమ్మెల్యేకు అభినందనలు


ఉంగుటూరు ఎమ్మెల్యే ధర్మరాజును కలిసిన నియోజకవర్గ సర్వేయర్లు

ఉంగుటూరు: ఉంగుటూరు ఎమ్మెల్యే పి.ధర్మరాజును మండలంలోని సర్వేయర్లు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మొక్కను అందజేసి ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారి ఉంగుటూరు సర్వేయర్ పొన్న శ్రీనివాస్, నిడమర్రు సర్వేయర్ విజయరాజు, భీమడోలు సర్వేయర్ ధర్మారావు, గణపవరం సర్వేయర్ దీప్తి లాస్యలు ఉన్నారు. అలాగే ఎంపీపీ గంట శ్రీలక్ష్మి సుబ్బారావులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాచుగుంట సర్పంచ్ ఏలేటి సునీత సురేష్ తదితరులు పాల్గొన్నారు.

17 నుంచి కంప్యూటర్ శిక్షణ

ఏలూరు (టూటౌన్): ఈ నెల 17 నుంచి ఏలూరు వసంతమహల్ సెంటర్‌లోని కావూరి ఫౌండేషన్ కార్యాలయంలో టైపు, కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నట్టు సంస్థ పీఆర్‌ఓ పులి శ్రీరాములు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన వారికి టైపు, డీసీఏ, డీటీపీలో ఇంటర్ కామర్స్‌తో ఉత్తీర్ణులైన వారికి టాలీలో శిక్షణ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. ఈ నెల 15 నుంచి 17 వరకు సంస్థ కార్యాలయంలో దరఖాస్తులు ఇస్తున్నట్టు తెలిపారు. 17 నుంచి శిక్షణ ప్రారంభమవుతుందని ఏలూరు నగరం, పరిసర గ్రామాల్లో 35 సంవత్సరాల్లోపు యువతీ, యువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని శ్రీరాములు కోరారు.

వేతన బకాయిలు విడుదల చేయాలి

కామవరపుకోట: ఉపాధి హామీ కూలీలకు పేస్లిప్పులు ఇచ్చి, వేతన బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు పి.చంటి, అందుగుల ప్రభాకర్‌రావు డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని రామన్నపాలెం, ఉప్పలపాడు గ్రామ సమీపంలో ఉపాధి హామీ పని చేస్తున్న కూలీలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామన్నపాలెం, ఉప్పలపాడు ఉపాధి కూలీలకు ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు రోజువారీ వేతన కూలి పే స్లిప్పులు ఇవ్వలేదని, తక్షణమే కూలీలకు స్లిప్పులు అందజేయాలన్నారు. మూడు నెలల నుంచి కూలీలు పని చేస్తున్నప్పటికీ వేతన బకాయిలు లక్షల రూపాయలు ఉన్నాయని వేతనాలు రాక కూలీలు ఆకలితో అలమటిస్తున్నారని పలుమార్లు అధికారులను వేతనాలు విడుదల చేయాలని దరఖాస్తులు పెట్టినప్పటికీ కూలీలపై చిన్న చూపు చూస్తూ నిమ్మకు నీరుగారినట్టు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధి హామీ చట్టంలో 15 రోజులకోసారి వేతన బకాయిలు, జాబు కార్డులు, పేస్లిప్పులు కూలీలకు ఇవ్వాలని చట్టం ఉన్నప్పటికీ ఎందుకు అమలు చేయటం లేదన్నారు. తక్షణమే అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు.

పారిశుద్ధ్య నిర్వహణలో అలసత్వం తగదు


గణపవరంలో పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి విక్టర్

గణపవరం: వాతావరణ మార్పులు, వర్షాల కారణంగా పారిశుద్ధ్య నిర్వహణపై అప్రమత్తంగా ఉండాలని, ఏమాత్రం అలసత్వం వహించరాదని జిల్లా పంచాయతీ అధికారి ఆర్.విక్టర్ అన్నారు. శుక్రవారం సాయంత్రం ఆయన గణపవరం పంచాయతీ పరిధిలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను తనిఖీ చేశారు. ఈసందర్భంగా పలు ప్రాంతాలను సందర్శించి పారిశుద్ధ్య నిర్వహణ తీరును పరిశీలించారు. పనులు జరుగుతున్న ప్రాంతాలకు వెళ్లి వారికి పలు సూచనలు ఇచ్చారు. ప్రతి రోజూ పారిశుద్ధ్య నిర్వహణపనులు జరగాలని, డ్రైయిన్లలో పూడిక ఎప్పటికప్పుడు తొలగించాలని, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో కె.సూర్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి డి.శివరామ్‌ప్రసాద్‌లకు సూచించారు. వర్షాకాలం ప్రారంభం కావడంతో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. అంటువ్యాధులు వ్యాప్తి చెందకుండా తగిన చర్యలు తీసుకోవాలని, దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలని, అంటువ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ మూర అలంకారం తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం సొమ్ము కోసం ఎదురుచూపు


నాచుగుంట ఆయకట్టులో ధాన్యం ఎగుమతి చేస్తున్న కూలీలు (ఫైల్)

ఉంగుటూరు: ధాన్యం విక్రయించిన రైతులకు సొమ్ము అందక ఇబ్బందులు పడుతున్నారు. కోత కోసిన యంత్రాలకు బాడుగ, కూలీలకు కూలి సొమ్ము, పురుగు మందులు, ఎరువుల వ్యాపారులకు బకాయిలు చెల్లించాల్సి ఉందని రైతన్నలు అంటున్నారు. మూడునెలలు కావస్తున్నా ధాన్యం సొమ్ము అందలేదని వాపోయారు. సార్వత్రిక ఎన్నికల నోటిఫికేష్ విడుదలైన అనంతరం ధాన్యం సొమ్ము జమ కాలేదు. ఖరీఫ్ పెట్టుబడికి చేతిలో సొమ్ము లేక రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. నియోజకవర్గంలో 16,109 మంది రైతులకు రూ.346.51 కోట్ల ధాన్యం సొమ్ము చెల్లించాల్సి ఉంది. ఇప్పటికే రూ.200 కోట్లు మాత్రమే చెల్లించారు. ధాన్యం ఎగుమతి చేసిన 21 రోజులకు ధాన్యం సొమ్ము జమ కావాల్సి ఉంది. ఈసారి డబ్బు చెల్లింపులో జాప్యం జరిగింది. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం త్వరితగతిన ధాన్యం సొమ్ము విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.

బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి


పాతూరులో తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

భీమడోలు: బడిఈడు పిల్లలందరూ తప్పనిసరిగా పాఠశాలలకు పంపిపంచాలని హెచ్‌ఎం పి.నిర్మల కుమారి తెలిపారు. శుక్రవారం పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులు నేను బడికి పోతా కార్యక్రమాన్ని నిర్వహించారు. సూరప్పగూడెం పంచాయతీ పరిధిలోని పాతూరు ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం పి.నిర్మలకుమారి ఆధ్వర్యంలో ఉపాధ్యాయుడు మండే సుధాకర్, సిబ్బంది ఐదేళ్ల నిండిన బాలబాలికల ఇంటింటికీ వెళ్లి వారి తల్లిదండ్రులతో మాట్లాడి పాఠశాలలో చేర్పించుకున్నారు. ఒకటవ తరగతిలో ఐదుగురు చిన్నారులు చేరారు. ఈ సందర్భంగా విద్యా సంస్కరణల్లో భాగంగా ప్రభుత్వంలో నాణ్యమైన విద్యాబోధనతో పాటు కనీస వసతులు సమకూరాయన్నారు. పాఠశాలలో డిజిటల్ విద్యతో ఎండీఎం, చిక్కీలను అందించి ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా కృషి చేస్తున్నామన్నారు. ప్రభుత్వ బడులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని ఉన్న స్థితి నుంచి ఉన్నతస్థితికి చేరుకోవాలన్నారు.

ఎన్నికల హామీల అమలుకు కార్యాచరణ


దెందులూరు ఎన్‌టీఆర్ సెంటరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్

దెందులూరు: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీల అమలుకు బాధ్యతలు చేపట్టిన వెంటనే సంతకాలు చేసి కార్యాచరణకు ఏర్పాట్లు చేశారని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. శుక్రవారం ఆయన దెందులూరు 9వ వార్డు సెంటరులో ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎంతో మందికి మేలు జరిగే విధంగా కూటమి ప్రభుత్వం పయనిస్తోందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు ఉప్పలపాటి రామ్‌ప్రసాద్, వీరమాచినేని ప్రభాకర్, కొడాలి ఆంజనేయచౌదరి, మండల పార్టీ అధ్యక్షుడు మాగంటి నారాయణప్రసాద్ (మిల్లుబాబు), క్లస్టర్ ఇన్‌చార్జి గారపాటి కొండయ్యచౌదరి, సర్పంచ్ తోట ఏసమ్మ, గ్రామ పార్టీ అధ్యక్షుడు ఇప్పిలి వెంకటేశ్వరరావు, నాయకులు మోత్కూరి నాని, పెనుబోయిన మహేష్ యాదవ్, జహీర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సామాజిక వైద్యుడు చేగువేరా


చేగువేరా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు, విద్యార్థులు

ఏలూరు (టూటౌన్): సమాజానికి వైద్యం చేయడానికి యత్నించిన సామాజిక వైద్యుడు చేగువేరా అని ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు అన్నారు. స్థానిక పవరుపేటలోని ఏవీఆర్ విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన చేగువేరా 96వ జయంతి కార్యక్రమం కంప్యూటర్ ప్రిన్సిపాల్ ఎంఎస్ఎన్ లక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. చేగువేరా చిత్రపటానికి నరసింహారావు పూలమాల వేసి నివాళులర్పించారు. కంప్యూటర్ శిక్షణా కేంద్రం విద్యార్థులు చేగువేరాకు జోహార్లర్పించారు. నరసింహారావు మాట్లాడుతూ 1928లో అర్జెంటైనాలో జన్మించిన చేగువేరా మెడిసిన్ చదివారన్నారు. దక్షిణ అమెరికాలో ప్రజల పరిస్థితులను అమెరికా పెత్తనాన్ని మోటార్ బైక్ ద్వారా సందర్శించి, అమెరికా వ్యతిరేక పోరాటానికి పూనుకున్నారని గుర్తుచేశారు. ఆమెరికాకు 90 కిలో మీటర్ల దూరంలో ఉన్న క్యూబాలో ఫెడ్రల్ క్యాస్ట్రోతో కలిసి తిరుగుబాటును చేసి దేశాన్ని విముక్తి చేయడంలో ముఖ్య పాత్ర పోషించాడన్నారు. ఆర్థిక మంత్రిగా ప్రపంచ దేశాల మద్దతుతో క్యూబా అభివృద్ధికి బాటలు వేశారన్నారు. భారతదేశంలో ఢిల్లీ, కలకత్తా నగరాలకు వచ్చి మద్దతు కోరాడని తెలిపారు. ప్రపంచంలో పంచదార ఉత్పత్తి, వైద్య రంగం, బాక్సింగ్ రంగంలో క్యూబా ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. అందుకు చేగువేరా వేసిన పునాది తోడ్పడిందని చెప్పారు. కార్యక్రమంలో సాయి సిద్ధార్థ, లక్ష్మణరావు, హారిక, వాసవి, రేష్మ, విజయ్ కుమార్, రాజ్ కుమార్, విజయ్ కృష్ణ పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలి


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న వైద్యాధికారిని ఆశ్విని


రక్తదాన అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న వైద్యాధికారి సంతోష్‌కుమార్‌రెడ్డి

భీమడోలు: ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ అశ్విని అన్నారు. భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని రోగులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అశ్విని మాట్లాడుతూ రక్తదానం చేసే వ్యక్తులు ఎటువంటి అపోహలు పెట్టుకోవద్దన్నారు. రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. ప్రతి ఒక్కరూ జీవిత కాలంలో రక్తం చేయాలని, తద్వారా సంపూర్ణ ఆరోగ్యవంతులవుతారన్నారు. రక్తదానం చేసే దాతలు గ్రహీతల హృదయాల్లో నిలిచిపోతారన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు రష్మీ, ఆనంద్, కిషోర్, బ్లడ్ బ్యాంకు సిబ్బంది అప్పారావు, పరమేశ్వరరావు రోగులు పాల్గొన్నారు.

గణపవరంలో..

గణపవరం: రక్తదానం వల్ల ఎలాంటి అనారోగ్యం కలగదని, రక్తదానం చేస్తే ఆరోగ్యపరిస్థితి మరింత మెరుగవుతుందని గణపవరం మండలం పిప్పర పీహెచ్‌సీ వైద్యాధికారులు సంతోష్‌కుమార్‌రెడ్డి, కె.ప్రియాంక అన్నారు. శుక్రవారం గణపవరం మండలం కాశిపాడులో రక్తదాన దినోత్సవం సందర్భంగా రక్తదాన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్తదానంపై అపోహలు వీడాలని, 18 నుంచి 60 ఏళ్లలోపు వయస్సు ఉన్నవారం 150 సార్లు రక్తదానం చేయవచ్చునని తెలిపారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని సూచించారు. ఆరోగ్య సహాయకుడు నామాలరాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆలస్యంగా వికసించిన మే పుష్పం


దెందులూరు హెల్త్ సూపర్‌వైజర్ ఇంట్లో వికసించిన మే పుష్పం

మే పుష్పం ఆలస్యంగా వికసించింది. సాధారణంగా ఈ పుష్పం సంవత్సరంలో ఒక్కసారి మాత్రమే వేసవిలో మే నెలలో వికసిస్తుంది. దెందులూరులో హెల్త్ సూపర్‌వైజర్ నాగలక్ష్మి ఇంట్లో జూన్ 14న ఈ పుష్పం వికసించి చూపరులను ఆకట్టుకుంది.

- దెందులూరు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


మొక్కలు నాటిన ఎంఈఓ అన్నమ్మ, హెచ్‌ఎం శర్మ, ఉపాధ్యాయులు


కైకరంలో విద్యార్థులకు పర్యావరణంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

దెందులూరు: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, మానవ మనుగడకు, సంపూర్ణ ఆరోగ్యకరమైన సమాజం రూపుదిద్దుకునేందుకు మొక్కలు నాటాలని దెందులూరు ఎంఈఓ కే.అన్నమ్మ అన్నారు. పర్యావరణ పరిరక్షణ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం కొవ్వలి ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం ఎస్ఎల్ఎన్‌వీజీ శర్మ ఆధ్వర్యంలో 48 రకాల మొక్కలను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి నాటారు. త్వరలోనే నాటిన అన్ని మొక్కలకు గార్డులు ఏర్పాటు చేస్తామని హెచ్‌ఎం శర్మ అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తరుణకుమారి, రాధాకృష్ణ, మజీద్‌ఖాన్ ఉన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

ఉంగుటూరు: చక్కని జీవన విధానం అలవరుచుకోవడం ద్వారా మంచి ఆరోగ్యవంతమైన జీవితాన్ని పొందవచ్చునని కైకరం హైస్కూల్ హెచ్‌ఎం గుళ్ల ప్రసాదరావు అన్నారు. శుక్రవారం ఉంగుటూరు మండలం కైకరం హైస్కూల్‌లో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా వ్యర్థాలను తగ్గించడం, ఆరోగ్యవంతమైన జీవన విధానం అలవరుచుకోవడం అనే అంశాలపై ఎకోక్లబ్స్ ఫర్‌మిషన్‌లైఫ్ సంస్థ ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయులు బగాది సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

కంపెనీ బియ్యం అని నమ్మించి మోసం

ఉంగుటూరు: ప్రముఖ కంపెనీకి చెందిన సన్న బియ్యం అని నమ్మించి రేషన్ బియ్యం విక్రయిస్తున్న వ్యాపారిపై కొనుగోలుదారులు ఆగ్రహం వ్యక్తం చేశాడు. వివరాల్లోకి వెళితే చేబ్రోలు బెనర్జీ కాలనీలో నివాసం ఉంటున్న రేకపల్లి వెంకటనరసింహనాయుడి వద్దకు ఈనెల 6న తన్నేరు కిషోరు, అతనితోపాటు మరోవ్యక్తి రెండు బియ్యం బస్తాలు తెచ్చారు. మిల్లు నుంచి షాపులకు బియ్యం బస్తాలు సరఫరా చేస్తుంటామని, లారీ రోడ్డుపై ఆగిపోవడంతో డబ్బుల కోసం బియ్యం బస్తాలు విక్రయిన్నామంటూ నాయుడిని నమ్మించారు. వారి ఫోన్ నంబరు కూడా ఇచ్చారు. వాళ్లు చెప్పే మాటలు నమ్మిన నాయుడు రెండు బస్తాలను రూ.2,600 చెల్లించి తీసుకున్నాడు. ఆ బస్తాలు తెరిచి చూస్తే రేషన్ బియ్యం ఉంది. వెంటనే నాయుడు వాళ్లకు ఫోన్ చేస్తే స్పందించ లేదు. మోసపోయామని గ్రహించిన బాధితుడు నాయుడు స్థానిక తహసీల్దారు కార్యాలయంలో, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

వ్యాధులపై అప్రమత్తత అవసరం


చాటపర్రు దళితవాడలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

ఏలూరు రూరల్ : వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు అన్నారు. శుక్రవారం చాటపర్రు పీహెచ్‌సీ వైద్యుడు శ్రీకృష్ణ సూచనల మేరకు చాటపర్రు దళితవాడలో ఫ్రైడే డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ మలేరియా మాసోత్సవంలో భాగంగా ప్రజలకు దోమల నివారణపై అవగాహన కల్పిస్తున్నట్టు చెప్పారు. నీటి నిల్వ ఉండే ప్రాంతాల్లో దోమలు, ఈగలు పెరిగి ప్రజలు అనేక సీజనల్ వ్యాధులకు గురౌతారని వివరించారు. ఇంటి పరిసరాల్లోని తొట్టెలు, డ్రమ్ములు, కుండీలు, రుబ్బురోలు తదితర వస్తువుల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో వాడేసిన ఇంజిన్ ఆయిల్ చల్లితే దోమల పెరుగుదల అడ్డుకోవచ్చన్నారు. ఫలితంగా దోమల వల్ల ప్రబలే మలేరియా జ్వరాలను అడ్డుకోవచ్చని తెలిపారు. దోమ నుంచి రక్షణకు దోమ తెరలు ఉపయోగించాలని, సాయంత్ర వేళల్లో దోమలు ఇళ్లలోనికి రాకుండా కిటికీలు వేసుకోవాలని సూచించారు. ఆరోగ్య విస్తరణ అధికారి రామాంజనేయులు, హెల్త్ సూపర్‌వైజర్ కిరణ్‌కుమార్, ఆరోగ్య కార్యకర్త సంధ్యారాణి, జ్యోతి, సుహాసిని, కృష్ణకుమారి పాల్గొన్నారు.

'ముస్లింలకు పథకాలు అమలు చేస్తాం'

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరు నియోజకవర్గంలో అర్హులైన ముస్లింలందరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తామని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. నగరానికి చెందిన అంజుమన్ ముహాఫిజుల్ ఇస్లాం సంస్థ ప్రతినిధులు శుక్రవారం చంటిని ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. చంటిని దుశ్శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. చంటి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఇమామ్‌లు, మౌజన్‌లకు గౌరవ వేతనం పెంచుతారని, మసీదుల అభివృద్ధికి రూ.1 లక్ష మంజూరు చేస్తారని తెలిపారు. హజ్ యాత్రికులకు ఆర్థిక సాయం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అంజుమన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎండీ సులేమాన్, ఎండీ అస్లాం షరీఫ్, కోశాధికారి ఎండీ మదార్‌ఖాన్, రాజా అహ్మద్, రియాజ్ అలీ ఖాన్, ఎండీ జబీవుల్లా, ఎండీ అక్బర్, జాకీర్ హుస్సేన్, ఎండీ ఇలియాస్ పాషా, ఎండీ ఎక్బాల్, ఎస్‌కే అలీ, ఎండీ ఖలీముద్దీన్, ఎస్‌కే ఖాసిమా తదితరులు పాల్గొన్నారు.